ఓం నమః శివాయ!

- శివనామ స్మరణతో మార్మోగిన శైవాలయాలు
- కార్తీక చివరి సోమవారం కళకళలాడిన ఆలయ ప్రాంగణాలు
- స్వామివార్లకు ప్రత్యేక పూజలు

గడివేముల: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మండల పరిధిలోని ఎర్రమల కొండలలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం శివనామ స్మరణతో మారుమోగింది. అమ్మవార్లకు ప్రాతఃకాల పూజలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు వైభవంగా జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా రావడంతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న పంచకోనేర్లలో భక్తులు స్నానమాచరించి స్వామి,అమ్మవార్లకు దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చెక్కభజన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. భక్తులకు కాశీరెడ్డినాయన, ఆర్యవైశ్య, మామిళ్లపల్లి అన్నదాన విశ్వనాథశర్మ సత్రాల్లో ఉచిత అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు వాహనాల కోసం పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు బీటీ వెంకటసుబ్బయ్య సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేశారు.


భోగేశ్వరుడి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు


స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం

కాల్వబుగ్గలో కార్తీక సందడి

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి సన్నిధిలో కార్తీక సందడి నెలకొంది. చివరి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యంలో తరలివచ్చి స్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు స్థానిక కోనేరులో స్నానాలు ఆచరించి, స్వాముల గర్భగుడి ఎదురుగా గల ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ కుటుంబ సమేతంగా కాల్వబుగ్గను సందర్శించారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ముందుగా బుగ్గరామేశ్వరస్వామిని దర్శించుకొని స్వాముల వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.


ప్రత్యేక అలంకారంలో గంగమ్మ


భోగేశ్వరంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కాల్వబుగ్గలో దర్శనం కోసం బారులుతీరిన భక్తజనం, స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో వనభోజనాలు

పాణ్యం : కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకొని స్థానిక శ్రీ గంగమ్మ ఆలయం వద్ద గంగపుత్రుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాముహిక వనభోజనాలు కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే పాణ్యం బస్టాండ్ సమీపంలో జమ్మిచెట్టు వద్ద ఉన్న శివలింగం వద్ద భక్తులు వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీపాణికేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

సుంకేసులకు నిలిచిన ఇన్‌ఫ్లో


రిజర్వాయర్

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో నిలిచి పోయినట్లు సోమవారం అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 221 క్యూ సెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో పూర్తి స్థాయి నీటి నిల్వ 1.20 టీఎంసీలు ఉంది.

'ఆడుదాం ఆంధ్ర' పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

గూడూరు: ఆడుదాం - ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వలంటీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నైపుణ్యత కలిగిన క్రీడా కారులుంటారని, వారిని గుర్తించి శిక్షణ ఇస్తే ప్రతిభావంతులైన క్రీడా కారులుగా తయారవుతారన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఆడుదాం - ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కబడ్డీ, ఖోఖో తదితర పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎంఈఓ సునీలమ్మ, ఈఓఆర్డీ మధులత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థి చేతన్ ఆల్ ఇండియా సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 8న అనంతపురంలో జరిగిన జేఎన్‌టీయూ ఎంపిక పోటీల్లో తమ కళాశాలకు చెందిన చేతన్ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. త్వరలో జరిగే ఆల్‌ఇండియా సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. అనంతనం కళాశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో మునిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సాంకేతిక సదస్సులు


మాట్లాడుతున్న డాక్టర్ ఓబులేసు

పాణ్యం : సమస్యల పరిష్కారానికి సాంకేతిక సదస్సులు వేదికగా నిలుస్తాయని హైదరాబాద్‌కు చెందిన వీజేఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ఓబులేసు అన్నారు. సోమవారం ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల ఎఫ్‌డీపీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల, జేఎన్‌టీయూ సంయుక్తంగా నిర్వహించే ఈ సదస్సులో డేటా అనలిటిక్స్ ఎమర్జింగ్ అనే అంశంపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్జీఎం డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయప్రసాద్, సుబ్బారెడ్డి, ప్రహ్లాద్‌రావు, రామిరెడ్డి, రాసన్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

కల్లూరు: మండల పరిధిలోని పెద్దపాడు మజరా గ్రామమైన ఎ.నాగలాపురం గ్రామానికి శ్మశానం వాటిక ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులు ధర్నా చేపట్టారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఇంతకు మునుపు అంత్యక్రియలు చేసే స్థలము పట్టా స్థలాలు కావడంతో లబ్ధిదారులు అక్కడ ఖననం చేయనివ్వడం లేదన్నారు. ఈ మధ్యనే గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందితే కర్నూలు శ్మశాన వాటిలో అంత్యక్రియలు చేయాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుబ్బారెడ్డి, మహేశ్వరరెడ్డి, నబీసాహెబ్, మనోహర్, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

అధిక దిగుబడి సాధించండి


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: రైతులు వరి సాగులో మెలకువ పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన మండలం పరిధిలోని కొండాపురం పరిధిలోని వరి పొలాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ సిద్ధు పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- నన్నూరులో గడప గడపకు మన ప్రభుత్వం ప్రారంభం

ఓర్వకల్లు : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నన్నూరు-1వ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. మొదటి రోజు స్థానిక సుంకులాపరమేశ్వరి దేవాలయం నుంచి మొదలైన పర్యటన మైనార్టీ కాలనీ, మీదివేముల బిల్డింగులు, జంగాలపేటలో ముగించారు. ఎమ్మెల్యే కాటసాని ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలు, అవినీతి రహిత పాలన గూర్చి వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాలను అధికారంలోకి తెచ్చుకోవడం మనందరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మాటలు చెప్పి, మోసం చేసే పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు ఫాతిమాభి, కుసుమలత తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం : బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని ఎంఈఓ కోటయ్య అన్నారు. సోమవారం పాణ్యంలోని చెంచుకాలనీలో పిల్లలను బడికి పంపుదాం కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. విద్యపై సరైన అవగాహన లేక చెంచుల పిల్లలు ఇళ్ల వద్దే ఉంటున్నారని, వారిని బడికి వెళ్లేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇది వరకే బడి బయట పిల్లలను గుర్తించామని, వారిని కూడా బడిలో చేర్పించామని తెలిపారు.

గర్భిణులు, చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఓర్వకల్లు : గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐఓ) డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాల్వ-1, ఓర్వకల్లు సచివాలయాలలో మిషన్ ఇంద్ర ధనస్సు కింద గర్భిణులు, చిన్నారులకు నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని డీఐఓ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు (వైద్య ఆరోగ్య, విద్య, ఐసీడీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో జరిగే మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేయాలని ఆదేశించారు. ఏదేని కారణాల వల్ల టీకా వేయించుకోని(లెఫ్ట్ అవుట్, డ్రాప్ అవుట్) వారిని గుర్తించి వందశాతం టీకాలు వేయాలని సూచించారు. మరి ముఖ్యంగా హైరిస్క్ ప్రాంతాలైన ఇటుకల బట్టీలు, భవన నిర్మాణ కార్మికులు, వలస జీవుల గుడారాలు, కంకర మిషన్లు తదితర ప్రాంతాలలో పర్యటించి పిల్లలను గుర్తించి, అవసరమైన వారికి టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రేఖ, ఎంపీహెచ్‌ఈఓ రాబర్ట్, సీహెచ్‌ఓ లక్ష్మిదేవి, ఆరోగ్య కార్యకర్త మహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


గర్భిణికి మందుల కిట్టు అందజేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నదే

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. సోమవారం మండలంలోని ఎర్రదొడ్డి గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించి, నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సీఎం జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించారు. సంక్షేమ బోర్డును అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరముందన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను, మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ మంజుల, గ్రామ సర్పంచు మధుసూదన్‌రెడ్డి, నాయకులు మధుమోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అద్దుగల రాజశేఖరరెడ్డి, మగ్బుల్‌బాషా, ఈశ్వరయ్య, అబ్దుల్, మహేష్, శ్రీను పాల్గొన్నారు.

- వైఎస్సార్ జలకల పథకం కింద ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన రైతులు మద్దిలేటి, మహేష్‌లకు మంజూరైన పంపుసెట్లను ఎమ్మెల్యే సుధాకర్ సోమవారం అందజేశారు. పొలంలో వేసినటువంటి బోరుకు సర్పంచు మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పూజ చేసి ప్రారంభించారు.


ఎర్రదొడ్డి సమీపంలో వైఎస్సార్ జలకళ కింద వేసిన బోరుకు పూజ నిర్వహించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా.సుధాకర్


కొత్తకోటలో సర్వే సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సీఎం జగన్ ప్రజా నాయకుడు

సి.బెళగల్: ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం కొత్తకోట - 1 గ్రామ సచివాలయంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను, లబ్ధి వివరాలను తెలియజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ కలిపి రూ.15,87,90,496 అందజేసినట్లు చెప్పారు. లబ్ధి పొందిన వారంతో మనసాక్షితో రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మరోసారి జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలని కోరారు. అనంతరం సంక్షేమ బోర్డు, వైఎస్సీర్‌సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు మణిమోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, తదితరులు

జగనన్నతోనే ప్రజా సంక్షేమం

కర్నూలు కల్చరల్: ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మండలంలోని కొంతలపాడు గ్రామంలో సోమవారం 'మా నమ్మకం నువ్వే జగనన్న, ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ పథకం బోర్డును ఆవిష్కరించారు. అవినీతికి ఆస్కారం లేకుండా కుల, మత, ప్రాంత, వర్గ, పార్టీ తేడా లేకుండా సంక్షేమ ఫలాలు అందజేస్తున్న జగనన్నను మరోసారి ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్న కుమార్, వైస్ ఎంపీపీ నెహెమ్యా, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, మండల కన్వీనర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

కర్నూలు కల్చరల్: కోడుమూరు మండలం పులకుర్తి గ్రామం తెలుగుదేశం పార్టీకి చెందిన సుమారు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సమక్షంలో తన నివాసంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల మత, ప్రాంత, వర్గ, పార్టీ చూడకుండా చేస్తున్న అభివృద్ధికి, అందిస్తున్న సంక్షేమానికి, అలాగే ఎమ్మెల్యే పనితీరుకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు రంగన్న, దస్తగిరి, నాగేంద్ర తదితరులు పేర్కొన్నారు.


పార్టీ కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకోవాలి

కల్లూరు: మండలంలోని జగనన్న కాలనీలో స్థలం వచ్చి ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ గృహాలు నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ లక్ష్మన్న సూచించారు. సోమవారం పెద్దటేకూరు గ్రామ సచివాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం సిమెంట్, ఐరన్, ఇసుక తదితర మెటీరియల్ అందిస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనవరి 15 నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, సర్పంచ్, ఎంపీటీసీ మునిస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

సి.బెళగల్: మండల పరిధిలోని సంగాల గ్రామంలో కర్ణాటక అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ మన్మథవిజయ్ తెలిపారు. సంగాలలో అక్రమ మద్యం అమ్మకాలపై ఫిర్యాదుల రావడంతో సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన బైటిగేరి అడివప్ప అనే వ్యక్తి వద్ద కర్ణాటక రాష్ట్రానికి చెందిన 15 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిపై ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, 15 అక్రమ టెట్రా మద్యం ప్యాకెట్లను సీజ్ చేశామన్నారు.

వికసిత్ భారత్ కార్యక్రమాన్ని వీక్షించిన విద్యార్థులు

కర్నూలు (న్యూటౌన్): దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తలపెట్టిన వికసిత్ భారత్ 2047 వాయిస్ ఆఫ్ యూత్‌ను సోమవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు వర్చువల్‌గా వీక్షించారు. సోమవారం యూనివర్సిటీలో ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులు, సిబ్బంది వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని విన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

- రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి గగారిన్

కర్నూలు (అర్బన్) : విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి గగారిన్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక ప్రభుత్వ గిరిజన బాలికల గురుకులంలో మోటివేషన్ తరగతులు నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.శ్రీనివాస కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గగారిన్ మాట్లాడుతూ పరీక్షల పట్ల ఎవరూ భయపడాల్సిన పని లేదని, తరగతులు ప్రారంభమైనప్పటి నుంచి పరీక్షలు జరిగే సమయం వరకు నిత్యం పాఠశాలల్లో బోధించే పాఠాలను చదువుతూ ఉంటే ప్రతి ప్రశ్నకు సులభంగా జవాబులు రాయవచ్చన్నారు. అలాగే పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన పిల్లలు చదువు పట్ల ఆసక్తిని పెంచుకుని తమలో ఉన్న సామర్థ్యాన్ని వెలుగులోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం విద్య పట్ల చూపుతున్న శ్రద్ధను గుర్తించి ప్రభుత్వ ఆశయం నెరవేర్చేలా చదవాలన్నారు. ఈ నేపథ్యంలోనే అనేక అంశాలను విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీగురప్ప, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు తెలియజేస్తున్న గగారిన్

'ఆడుదాం ఆంధ్ర'కు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): ఆడుదాం -ఆంధ్ర క్రీడల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్నకు వివరించారు. సోమవారం ఆయన విజయవాడ నుంచి ఆడుదాం-ఆంధ్రపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని పరిస్థితులను పీఎస్‌కు వివరిస్తూ...సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిర్వాహక కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్రీడల నిర్వహణపై ఎంపీడీఓలతో సమన్వయం చేసుకుంటూ పీఈటీ, పీడీల ద్వారా వలంటీర్లకు క్రీడా శిక్షణపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. క్రీడల నిర్వహణకు సంబంధించిన అన్ని మైదానాల వివరాలను అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. సచివాలయ స్థాయి, మండల స్థాయి స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,33,736 మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఆమె వివరించారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి

గూడూరు: స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటరమణ సూచించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో కలిసి తహసీల్దార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్పందనలో ఎంపీడీఓ రాముడు, ఎంఈఓ సునీలమ్మ, పీఆర్ ఏఈ గోపాల్‌రావ్ పాల్గొన్నారు.

స్పందనపై నిర్లక్ష్యం

సి.బెళగల్: స్పందన కార్యక్రమంపై మండల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన స్పందన కకార్యక్రమానికి తహసీల్దార్ శేషఫణి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు మాత్రమే సమయానికి హాజరుకాగా, కొంత మంది ఆలస్యంగా వచ్చారు. మరి కొంతమంది పూర్తిగా గైర్హాజరయ్యారు. అధికారులు గైర్హాజరైన విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ చెప్పారు.



స్పందన నిర్వహిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

మ్యాన్‌హోల్‌ను మూసేశారు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు ఓల్డ్‌సిటీలోని ఛత్రీబాగ్ మసీదు వద్ద నెల రోజులుగా నోరు తెరుచుకుని ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌కు మున్సిపల్ అధికారులు మూత వేశారు. మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉందనే విషయంపై 'సాక్షి' దినపత్రికలో ఆదివారం 'నోరు తెరుచుకున్న మ్యాన్‌హోల్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు శరవేగంగా స్పందించిన కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు సోమవారం ఉదయం నోరు మ్యాన్‌హోల్‌ను ఇనుప కడ్డీల మూతతో మూసి వేయించారు. దీంతో స్థానిక ప్రజలు వెంటనే స్పందించి చకచకా పనులు చేయించిన నగర పాలక సంస్థ అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.


ఇనుపకడ్డీలతో మూసేసిన మ్యాన్‌హోల్

సాక్షి ఎఫెక్ట్